క్లుప్తంగా

వైభవంగా భావనారుషి కల్యాణం



తాడేపల్లిరూరల్: పద్మశాలీల బజారులోని భ్రమరావతి సమేత భావనారుషి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి అర్చకులు అనంతాచార్యులు, చిలకమర్తి సత్య ప్రభాకర శాస్త్రి, చిలకమర్తి లక్ష్మీ నరసింహ శాస్త్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, శ్రీ భ్రమరావతి సమేత భావనారుషిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగిస్తూ తాడేపల్లి బకింగ్ హామ్ కెనాల్‌కు తీసుకెళ్లి పుణ్యస్నానాలు చేయించారు. అనంతరం దేవాలయంలో 9 మంది దంపతులతో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. రాత్రి 10 గంటల సమయంలో కల్యాణోత్సవం సందర్భంగా స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం గురువారం ఉదయం వరకు సాగుతుందని నిర్వాహకులు వెల్లడించారు.

కోళ్ల ఫారాల పరిశీలన



ఫిరంగిపురం: వేమవరం, నుదురుపాడు, వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లోని కోళ్ల ఫారాలను బుధవారం పశువైద్యాధికారి పీర్ అహ్మద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి వల్ల ఉభయగోదావరి జిల్లాల్లో అధిక సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే స్థానిక కోళ్ల ఫారాల్లోని కోళ్లను పరిశీలించామన్నారు. ఫారాల నిర్వాహకులకు కొన్ని సూచనలు చేశామని వివరించారు. ర్యాపిడ్ వ్యాక్సిన్ బృందాన్ని జిల్లా అధికారులు నియమించారని, దీనికి దీనికి పశువైద్యాధికారి పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తారని చెప్పారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



తాడేపల్లిరూరల్ : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ప్రజా సంఘాల నాయకులు బుధవారం విస్తృత ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి లక్ష్మణరావును గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకట రెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, కోటబాబూరావు, పల్లె కృష్ణ, కెవిపిఎస్ నాయకులు నాగపోజు విజయరాజు, సీఐటీయూ నాయకుల కంచర్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరఫున తాడేపల్లిలో టీడీపీ నేతలు ప్రచారం చేశారు.

దుగ్గిరాల: దుగ్గిరాల గ్రామంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరఫున వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎం.యోగేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాసరావు, బి.అంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి నగరంలోనూ పలు సంఘాల నేతలు ప్రచారం చేశారు.

భూములున్న రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



కొల్లిపర: మండలంలో వ్యవసాయ భూమి ఉన్న యజమానులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమం ద్వారా వారి వివరాలు నమోదు చేసుకుని 11అంకెలుగల రైతు గుర్తింపు నెంబరు పొందాలని ఏవో కె.వెంకటరావు తెలిపారు. బుధవారం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రిజిస్ట్రేషన్ కార్యక్రమం వ్యవసాయ శాఖ రెవెన్యూ శాఖ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ఈ రిజిస్ట్రేషన్ వల్ల వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ పథకాలు, పంట రుణాలు, పంటల బీమా, పంట కొనుగోలు వంటి కార్యక్రమాలు రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చిన 11 అంకెల ద్వారా మాత్రమే నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. రైతులు నమోదు కోసం ఆధార్ కార్డు,ఆధార్ కు లింకు అయిన మొబైల్, పట్టాదారు పాస్ బుక్ తీసుకుని మీ రైతు సేవా కేంద్రంకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని వివిధ గ్రామాలలోని పంట భూములు కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఊరిలో రంగ హరీ..!

- సమస్యల వలయంలో హరిదాసుల కాలనీలు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- కాలువల్లో పారుతున్న మురుగునీరు
- వెలగని విద్యుత్ వీధి దీపాలు



బేతపూడి కాలనీలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి, గుండాలపాడు శివారు ప్రాంతాల్లో ఉన్న హరిదాసుల కాలనీలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. కనీస వసతులు లేక సతమతమవుతున్నాయి. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కాలువల్లో మురుగునీరు సరిగా పారట్లేదు. విద్యుత్ వీధి దీపాలు వెలగవు. దీంతో పక్కపక్కనే ఉండే ఈ కాలనీల్లో హరిదాసుల కుటుంబాలు అష్టకష్టాలు పడుతున్నాయి.

అందరూ పేదలే

ఈ కాలనీల్లో మొత్తం 250 కుటుంబాలు జీవిస్తున్నాయి. అన్నీ పేద కుటుంబాలే. వీరు వ్యవసాయ పనులతోపాటు పెయింటింగ్, తాపీ పనులకు వెళ్తారు. సంక్రాంతి సమయాల్లో హరిదాసులుగా గ్రామాలకు వెళ్లి తమ కీర్తనలతో ప్రజలను రంజింపజేసి నాలుగు డబ్బులు సంపాదించుకుంటారు. పండగ తర్వాత తిరిగి వచ్చి మళ్లీ మామూలు పనులకు వెళ్తారు.

తాగునీటికీ కటకట

బేతపూడి దాసుల కాలనీలో రెండు అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షం పడినా గుంతల్లో నీరు నిలిచిపోతోంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడ నిలిచిపోతోంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అధిక వర్షాలు కురిసినప్పుడు ఇళ్లల్లోకి నీరు వచ్చేస్తుంటుంది. బేతపూడి, గుండాలపాడు దాసుల కాలనీల్లో వీధి దీపాలూ వెలగవు. తాగునీటి అవసరాలకు రెండు బావులు ఉన్నా.. అవి పాచి పట్టి ఉన్నాయి. మంచినీటి కోసం ప్రజలు కటకటలాడాల్సిందే. దీంతో గత్యంతరం లేక వాటర్‌ప్లాంట్ల వద్ద నీరు కొని తాగుతున్నారు. వేసవి కాలంలో తమ బాధలు వర్ణనాతీతమని హరిదాసులు వాపోతున్నారు. బేతపూడి దాసులకాలనీ మధ్యలో ఆరు ఎకరాల పొలం ఉంది. దానిని వారు ఆరు తరాలుగా సాగుచేసుకునేవారు. ఆ భూమిలో రెండు దశాబ్దాల కిందట ప్రభుత్వం తాగునీటి వసతి కల్పించడం కోసం చెరువును తవ్వించింది. దీని చుట్టూ బండలు ఉండడంతో అది నిరుపయోగంగా మారింది. చెరువులో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో ఆ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. దీనిని బహిర్భూమిగా కొందరు ఉపయోగిస్తున్నారు. ఈ ప్రాంతంలో విష సర్పాలు, తేళ్లు తిరుగుతున్నాయి.



కానరాని డ్రెయినేజీ వ్యవస్థ



నిరుపయోగంగా మారిన చెరువు

ఒక ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు

ఇంటిస్థలాలు, ఇళ్లు లేక హరిదాసుల కుటుంబాలు ఇక్కట్లు పడుతున్నాయి. ఒక ఇంట్లోనే రెండు, మూడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రెండు కాలనీలకు కలిపి శ్మశాన స్థలం సెంటు మాత్రమే ఉండడంతో అది సరిపోక ఇబ్బంది పడుతున్నామని కాలనీల వాసులు ఆవేదన చెందుతున్నారు. తాగునీటి కోసం తవ్విన చెరువును పూడ్పించి నివేశన స్థలాలుగా ఇచ్చినట్లయితే తమకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కాలనీల వాసులు కోరుతున్నారు.

శ్మశాన వాటిక లేక ఇబ్బందులు



కాలనీలో చనిపోయిన వారి దహన క్రియలకు ఇబ్బందిగా ఉంది. సెంటు స్థలంలోనే శ్మశానవాటిక ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శ్మశాన వాటిక స్థలం కేటాయించాలి.

– ఎం.ఏడుకొండలు, బేతపూడి కాలనీ

పారని మురుగు



కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు. మురుగునీరు పారని దుస్థితి నెలకొంది. వర్షం పడితే మురుగు ఇళ్లలోకి వస్తోంది. మట్టిరోడ్డు సరిగా లేదు. కాలువలు తీయించాలి.

– డి.వీరాంజనేయులు, బేతపూడి కాలనీ

తాగునీటికి ఇక్కట్లు



కాలనీలో ఉన్న బావులు వేసవిలో ఎండిపోయే దుస్థితి ఉంది. తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. పేరుకు గుండాలపాడు దాసుల కాలనీ కానీ ఆ గ్రామం నుంచి తాగునీరు కూడా అందని పరిస్థితి. నీటి పన్ను కడుతున్నా చుక్కనీరు ఇవ్వట్లేదు.

– దారా సుబ్బారావు, గుండాలపాడు కాలనీ

నిఘా నేత్రాల్లో తాడేపల్లి

ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు

తాడేపల్లిరూరల్: నిత్యం వీవీఐపీలు రాకపోకలు సాగిస్తుండడంతో గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం రాజధాని ముఖద్వారమైన ఉండవల్లి సెంటర్‌లో ఎస్ఐ ఖాజావలి సీసీ కెమెరాలను, ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు మైక్‌లు ఏర్పాటు చేయించారు. ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు సారథ్యంలో తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను, మైక్‌లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రస్తుతం ఉండవల్లి సెంటర్‌తోపాటు ప్రకాశం బ్యారేజ్, వ్యాక్రిడ్జి, లోటస్, అమరావతి కరకట్టకు వెళ్లే మార్గం, ఓల్డ్ టోల్‌గేట్, భరతమాత విగ్రహం వద్ద, అరవింద నుంచి కేఎల్‌యూకు వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ట్రాఫిక్‌ను నియంత్రణకు ఉండవల్లి సెంటర్, ఓల్డ్ టోల్‌గేటు, పాతూరు అండర్ పాస్ వద్ద మైక్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు ఆదేశాల మేరకు మరో 30 ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామని, ఈ కెమెరాల్లో ఫుటేజ్‌ను ప్రతిరోజు తాడేపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి మానిటరింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామని, రాత్రి సమయంలో ఎవరైనా ఆకతాయిలు రోడ్లపై తిరుగుతున్నా ఈ కెమెరాలలో పరిశీలించి పెట్రోలింగ్ నిర్వహించే వారికి సూచనలు అందజేసే విధంగా సీఐ కళ్యాణ్‌రాజు ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ ఖాజావలి వివరించారు.



ఉండవల్లిలో సీసీ కెమెరాలు, మైక్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ ఖాజావలి

శ్రీల ప్రభుపాదులకు విశ్వగురు బిరుదు ప్రదానం



మహా కుంభ మేళాలో విశ్వగురు బిరుదును అందుకుంటున్న శ్రీల ప్రభుపాదులు

తాడేపల్లిరూరల్: ఇస్కాన్, హరేకృష్ణ ఉద్యమ వ్యవస్థాపక ఆచార్యులు శ్రీమద్ ఏసీ భక్తివేదాంత స్వామి శ్రీల ప్రభుపాదులకు కుంభమేళాలో అఖిల భారతీయ అఖారా పరిషత్ వారిచే విశ్వగురు బిరుదు ప్రదానం చేసినట్లు హరేకృష్ణ ఉద్యమ విజయవాడ, గుంటూరు అధ్యక్షులు హెచ్‌జీ వంశీధర ప్రభు బుధవారం తెలిపారు. తాడేపల్లి హరేకృష్ణ గోకుల క్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీల ప్రభుపాదులకు మహాకుంభమేళాలో విశ్వగురు ప్రదానం చేయడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. చరిత్రలో ఈ బిరుదు పొందిన మొదటి వ్యక్తి ఆయనేనని తెలిపారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఐక్యంగా పోరాడాలి



తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడుతూ 71 రోజులుగా కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని, అయినా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించలేదని, కార్మికులు ఐక్యంగా పోరాడి తమకు రావాల్సిన బకాయిలను పొందేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, సుబ్బారావు, లక్ష్మి, రమణ, సామ్రాజ్యం, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

జలదరింపు



నీరందక అడుగంటి పోయిన సాగర్ కాలువ

- అడుగంటుతున్న సాగర్ కాలువలు, చెరువులు
- సాగర్ నుంచి నీరు వదిలినా అదే దుస్థితి
- రూ.వేలు వెచ్చించి పొలాల్లోకి నీరు పంపింగ్ చేస్తున్నా ఫలితం శూన్యం
- ఎండిపోతున్న పంటలు
- ఆందోళనలో రైతులు

తాడికొండ: సాగర్ నుంచి అధికారులు నీటిని విడుదల చేసినా బండారుపల్లి మేజర్ పరిధిలోని శివారు కాలువలు అడుగంటుతున్నాయి. ఫలితంగా రైతులు పంటలను రక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న రైతులు కాలువల్లోని నీటిని తోడేస్తుండటంతోపాటు అక్కడక్కడా కాలువలపై కట్టలు వేసి నీరు నిలుపుదల చేస్తున్న నేపథ్యంలో శివారు భూములకు నీరందడం లేదు. ఫలితంగా ఈ ప్రాంతంలోని మిర్చి పంట ఎండిపోతోంది. పట్టించుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అడుగంటిన చెరువుల్లోని నీటినే రూ.లక్షలు వెచ్చించి రైతులు పొలాలకు ఆయిల్ ఇంజిన్లతో పంపింగ్ చేస్తున్నారు. అయినా ఫలితం ఉండట్లేదు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీటి విడుదల కోటాను పెంచడంతోపాటు కాల్వలపై అక్రమ నీటి వినియోగాన్ని అరికట్టాలని, కట్టలను తొలగించి శివారు భూములకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



అడుగంటిన చెరువులోని నీటిని పంపింగ్ చేస్తున్న ఆయిల్ ఇంజిన్లు



వడలిపోయిన మిర్చి పైరు

క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాలు పంపిణీ



తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి సోకిన వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యశాలలోని పీపీ యూనిట్ వైద్యురాలు డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగి ముక్కాల వీరయ్య ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు బుధవారం పాత ప్రభుత్వ వైద్యశాలలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందులను సక్రమంగా వాడకుంటే క్షయ పూర్తిగా తగ్గే అవకాశం ఉందన్నారు. దాతలు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లెకొండ రవికుమార్, మలేరియా అధికారులు అందె బాల చంద్ర మౌళి, శ్రీకంత ఉమాకాంత్, సోషల్ వర్కర్ ప్రవీణ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అధ్యక్షుల నియామకం



మంగళగిరి పట్టణ అధ్యక్షులు రాజేష్



మంగళగిరి రూరల్ అధ్యక్షులు వెంకట కృష్ణ



తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వేణుగోపాల సోమిరెడ్డి



తాడేపల్లి రూరల్ అధ్యక్షులు వెంకట నాగేశ్వరరావు



దుగ్గిరాల మండల అధ్యక్షులు శివగోపయ్య

మంగళగిరి టౌన్ : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల అధ్యక్షుల్ని నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి బుధవారం రాత్రి ఉత్తర్వులు విడుదలయ్యాయి. మంగళగిరి పట్టణ అధ్యక్షులుగా ఆకురాతి రాజేష్, మంగళగిరి రూరల్ అధ్యక్షులుగా నాలి వెంకట కృష్ణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులుగా బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా వెంకట నాగేశ్వరరావు (నాగయ్య), దుగ్గిరాల మండల అధ్యక్షులుగా తాడిబోయిన శివగోపయ్యలను నియమించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని స్పష్టం చేశారు.

కేఎల్‌యూ అధ్యాపకుడికి గ్లోబల్ ఎమ్మినెన్స్ అవార్డు



వి.ఎస్.మూర్తిని అభినందిస్తున్న కేఎల్‌యూ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ రాజశేఖరరావు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో దూరవిద్యా కేంద్రం, ఆన్‌లైన్ విద్యావిభాగంలో ఇన్‌స్ట్రక్షనల్ డిజైనర్‌గా పనిచేస్తున్న వీఎస్ మూర్తి వలివేటికి గ్లోబల్ ఎమ్మినెన్స్ అవార్డును ఇంటర్నేషనల్ మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రదానం చేసినట్లు వర్శిటీ వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు చెప్పారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజశేఖరరావు మాట్లాడుతూ తమ వర్శిటీలో ఇన్‌స్ట్రక్షనల్ డిజైనర్‌గా పనిచేస్తున్న వీఎస్ మూర్తి వలివేటికి ఈ ప్రతిష్టాత్మక అవార్డు లభించడం హర్షణీయమని అన్నారు. విద్యను సాంకేతికతతో సమ్మిళతంగా రూపకల్పన చేయడంలో, స్వయంగా నేర్చుకునే పాఠ్య సామగ్రిని అభివృద్ధి చేయడంలో, డిజిటల్ లెర్నింగ్ మాధ్యమాలను సమర్థంగా ఉపయోగించడంలో మూర్తి విశేష కృషి చేశారని అన్నారు. ఇంటర్నేషనల్ మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రకటించిన గ్లోబల్ ఎమ్మినెన్స్ అవార్డును విజయవాడలో జరిగిన అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ అందజేసిందని తెలిపారు. ఈ సందర్భంగా మూర్తి వలివేటిని యూనివర్శిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె. రాజశేఖరరావు, ప్రో వీసీ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, దూర విద్యాకేంద్రం మరియు ఆన్‌లైన్ విద్యా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎం.వి.నరేష్ తదితరులు అభినందించారు.

79 మంది రైతులకు 191 రిటర్నబుల్ ప్లాట్లు



ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

తాడికొండ: రాజధానికి భూములిచ్చిన మంగళగిరి, తుళ్ళూరు మండలాల పరిధిలోని 79 మంది రైతులకు బుధవారం ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానం ద్వారా 191 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. ప్లాట్లు పొందిన వారిలో మంగళగిరి మండలం నిడమర్రు 1-2, తుళ్ళూరు మండలం వెలగపూడి, మందడం 1-2, కురగల్లు 1-2, తుళ్ళూరు 1-2, నెక్కల్లు చెందిన రైతులు ఉన్నారు. ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు ప్లాట్ల ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందించారు. కన్నబాబు మాట్లాడుతూ రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు వీలైనంత వేగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియ ఆలస్యం కాకుండా కొత్తగా 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ప్రారంభించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీ సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ సాయి ప్రవీణ్ చంద్, ల్యాండ్స్ జాయింట్ డైరెక్టర్ డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, శేషిరెడ్డి, రవీందర్, పి.పద్మావతి, కె.స్వరమేరి పాల్గొన్నారు.

నేడు 167 మంది రైతులకు 364 ప్లాట్లు

రాజధాని ప్రాంతంలోని రైతులకు గురువారం కూడా ప్లాట్ల కేటాయింపు జరగనుంది. 167 మంది రైతులకు 364 ప్లాట్లు కేటాయిస్తామని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

దేశం కోసం మనం !

ఆలకించని జనాల నడుమ గాంధీ భక్తుడి ప్రచారం



బోసురోడ్డులోని కూడలిలో నాగరాజన్ ప్రసంగం

తెనాలి: మధ్యాహ్నం ఒకటిన్నర గంటలు... బోసు రోడ్డులో రైతుబజార్ సమీప నాలుగు రోడ్ల కూడలి. ఒకవైపు ఇందిరాగాంధీ విగ్రహం ఎప్పటిలాగే ఉంది. భోజనం వేళ కావటంతో జనం హడావుడిగా వాహనాలపై వెళుతున్నారు. ఒక పక్కగా ట్రక్ ఆటో...అందులో గాంధీ వేషధారణతో ఒకరు మైకులో గాంధీ-అంబేడ్కర్ సిద్ధాంతాలను ఏకరువు పెడుతున్నారు. పక్కన గాంధీ టోపీలతో మరో ముగ్గురు మహిళలు...అంతా ఎవరి దారిని వారు వెళుతున్నారు మినహా...ఆగి ఆలకించినవారు లేరు. 'దండియాత్ర-2' పేరుతో ఆటోకు రెండువైపులా ఫ్లెక్సీలున్నాయి. 'స్త్రీలకు, ప్రజాస్వామ్యానికి సంపూర్ణ మద్యపాన నిషేధమే రక్షణ కవచం, 'ఆర్టికల్-47 ప్రకారం ప్రభుత్వాలు మద్యపానం, మత్తుపానీయాలు నిషేధించాలి, రౌడీయిజం నశింపజేయాలి. ఏ పార్టీలోనైనా క్రిమినల్స్‌కు ఓటు వేయరాదు..' నినాదాలున్నాయి. పట్టణ రామలింగేశ్వరపేటకు చెందిన అతడి పేరు నాగరాజు. తండ్రి పేరును కూడా కలుపుకుని రామిశెట్టి రామచంద్రన్ నాగరాజన్‌గా నామకరణం చేసుకున్నారు. గాంధీ స్ఫూర్తితో గాంధీ దేశం వెల్ఫేర్ ట్రస్టును స్థాపించి, గాంధీ, అంబేడ్కర్ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగానే ఊరూరా తిరుగుతూ ప్రచారం సాగిస్తున్నారు. ఆ క్రమంలోనే బుధవారం పట్టణంలోని పలు వీధుల్లో ఆయన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. 'బతుకుదాం, బతికిద్దాం, బతికించడం కోసం బతుకుదాం...అంటూ స్వార్థ రాజకీయనాయకులకు ఓటు వేయొద్దని చాటుతున్నాడు. ఓటును అమ్ముకోవద్దనీ, డబ్బును ప్రేమించే నాయకులు జనాల్ని ప్రేమించలేరనీ చెప్పారు. మత సామరస్యాన్ని పాటించండి...బతికితే దేశం కోసమే బతకాలి...ఛస్తే దేశం కోసమే చావాలి'...అంటూ ఉద్వేగంగా ఆయన ప్రసంగించారు.

బహిరంగ మద్యపాన ప్రియులకు జరిమానా

తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి న్యాయమూర్తి జరిమానా విధించారు. తెనాలి టూటౌన్ సీఐ రాముల నాయక్ ఈ నెల 10వ తేదీన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 14 మందిపై కేసులు నమోదు చేశారు. అలానే మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు నుండి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. వీరిని బుధవారం కోర్టులో హాజరు పరచగా, బహిరంగంగా మద్యం తాగుతున్న 14 మందికి రూ. వెయ్యి చొప్పున, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధించారు.

ప్రకటన

[illegible]

రాయపూడి శ్రీనివాసరావు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)

7075167541 (తాడికొండ)

Office mail : sakshigntadvt@gmail.com